క్లుప్తంగా

నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



మార్షల్ ఆర్ట్స్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులు

ఆలమూరు: గ్రామానికి చెందిన సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో చక్కని ప్రతిభ కనబర్చారు. విజయవాడలోని అజిత్ సింగ్ నగర్‌లో సరళాదేవి కల్యాణ మండపంలో ఇటీవల జాతీయస్థాయిలో కరాటే తైక్వాండో, కుంగ్‌ఫూ పోటీలు జరిగాయి. అందులో భాగంగా టైక్వాండో పోటీల్లో బ్రౌన్ బెల్ట్ కటాస్ ఏ విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్ (గోల్డ్), బ్లూ బెల్ట్ విభాగంలో జి.షణ్ముఖ (గోల్డ్), ఎల్లో బెల్ట్ బి విభాగంలో బండి దైవీక్ ఆశిష్ (గోల్డ్), బ్రౌన్ బెల్ట్ బి విభాగంలో కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బుంగ అశ్విన్ (గోల్డ్), ఎల్లో బెల్ట్ బి.విభాగంలో జి.సత్య మోహన్ మణికంఠ (సిల్వర్) మెడల్స్ సాధించినట్లు కోచ్ టి.వెంకటలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు.

ఘనంగా తృతీయ వార్షికోత్సవం

అంబాజీపేట: స్థానిక చప్పిడివారిపాలెంలో వేంచేసిన కోదండరామస్వామి వారి ఆలయ వార్షికోత్సవ వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నరేంద్రపురం గ్రామశాఖ అధ్యక్షుడిగా త్రిమూర్తులు



త్రిమూర్తులును అభినందిస్తున్న నాయకులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ నరేంద్రపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుత్తుల త్రిమూర్తులు ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకుడు మెల్లం మహాలక్ష్మి ప్రసాద్ అధ్యక్షతన సోమవారం గ్రామంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గ్రామశాఖ ఉపాధ్యక్షుడిగా పాకా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొంబత్తుల వెంకట రమణ, మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గుత్తుల సత్యనారాయణ, నేలపూడి సత్యనారాయణ, నాయకులు జల్లి పండు, నేలపూడి ఆనందరావు, కొంబత్తుల శేఖర్, రాయుడు చిన్న, ఇళ్ల వెంకటేశ్వర రావు, ఎండీ వలీ, కుసుమ వెంకటేశ్వరరావు, కటికదల నాని తదితరులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి రూ.50 వేల విరాళం



కొత్తపేట మసీదులో ఖాజాబాబుకు విరాళం అందజేస్తున్న రెహమాన్

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదుకు హైదరాబాద్ నివాసి ఎండీ మెహబూబ్ రెహమాన్ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కొత్తపేటకు చెందిన రెహమాన్ ఉద్యోగ రీత్యా ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయన తన తల్లి మెహబూబ్ ఉన్నీసా శత జయంతి పురస్కరించుకుని, రంజాన్ మాసం సందర్భంగా సోమవారం కొత్తపేట జామియా మసీదులో స్థానిక ముస్లింలకు రెహమాన్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. అలాగే ఆ మసీదు అభివృద్ధి నిమిత్తం రూ.50 వేలు మండల ముస్లిం సంఘ నాయకుడు షేక్ గౌస్ చేతుల మీదుగా మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజాబాబుకు అందజేశారు. ఆయనకు ముస్లిం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు ఇమామ్ ఇంతియాజ్ అహ్మద్, మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు బిలాల్, కోశాధికారి షేక్ ఫరీద్, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి ఊరేగింపు



నూకాంబిక అమ్మవారి ఊరేగింపు

కపిలేశ్వరపురం: స్థానికంగా నూకాంబిక అమ్మవారి ఊరేగింపు సోమవారం నిర్వహించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు నేపథ్యంలో ఆలయంలో అమ్మవారి బుట్ట గరగను గ్రామాల వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించారు.

లాకుల వ్యవస్థ అస్తవ్యస్తం

- భారీగా లీకవుతున్న సాగునీరు
- శివారు ప్రాంత రైతులకు ఇబ్బంది



ఆలమూరులో శిథిలావస్థకు చేరిన లాకులు

ఆలమూరు: రైతులు దేవాలయాలుగా భావించే లాకుల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. రబీ సీజన్‌లో అసలే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న తరుణంలో శిథిలావస్థకు చేరుకున్న లాకుల వల్ల భారీ స్థాయిలో సాగునీరు లీకేజీ అవుతుంది. దీంతో శివారు ప్రాంతాలకు సాగు భూములకు నీరందక పోవడంతో పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయి. నీటి పారుదల వ్యవస్థపై అధికారులు అవలంభిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల భవిష్యత్‌లో వేలాది ఎకరాలకు నీరందని పరిస్థితి తలెత్తే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతుంది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల వరిసాగు జరుగుతుంది. వీటికి ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట నుంచి మూడు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందుతుంది. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే సాగునీటి వ్యవస్థ నియంత్రణకు నియోజకవర్గంలోని ఆరు చోట్ల లాకులను ఏర్పాటు చేశారు. ఆలమూరు మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల, కొత్తపేట మండలంలోని పలివెల, వాడపాలెం, రావులపాలెం మండలంలోని గోపాలపురం, ఆత్రేయపురం మండలంలోని లొల్ల వద్ద లాకులు నిర్మించారు. వీటిని నిర్మించి శతాబ్దకాలం పూర్తయినా ఆధునీకరించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆలమూరు లాకుల వద్ద లాక్ చాంబర్ (పడవలు వెళ్లే) మార్గం తలుపులు పూర్తిగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీనివల్ల లీకుల ఏర్పడి నీరు వృథాగా బయటకు పోతుంది.

లీకేజీలను అరికట్టకుంటే సాగునీరు ప్రశ్నార్థకం

తూర్పు డెల్టా ప్రధాన కాలువ ఆధునీకరణలో భాగంగా లాకులను ఆధునీకరించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.మూడు కోట్లు నిధులను కేటాయించారు. నిపుణుల బృందం లాకులను పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా అప్పట్లో మరమ్మతులు చేపట్టారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు లాకుల వ్యవస్థ గురించి పట్టించుకోలేదు. 2019–24 మధ్య కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ హయాంలో మాత్రమే కనీస మరమ్మతులు చేపట్టి పూర్తి స్థాయి ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇటీవల కాలంలో వివిధ లాకుల వద్ద అనేక చోట్ల చాంబర్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింది. అలాగే నియోజవర్గంలోని మిగతా లాకుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉందని రైతులు చెబుతున్నారు. దీనివల్ల కాలువల శివారు గ్రామాలకు భవిష్యత్‌లో సక్రమంగా నీరందే దారులు మూసుకుపోతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అసలే సిబ్బంది కొరత ఎదుర్కొంటున్న ఇరిగేషన్‌శాఖ పరిమితంగా ఉన్న సిబ్బందితోనే లాకుల వద్ద నీటిమట్టం నిలిపేందుకు నానా హైరానా పడుతుంది. ఈ లాకుల వద్ద లీకేజీలను అరికడితే అదనంగా మరో 20 వేల ఎకరాలను నీటిని అందించవచ్చని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి లాకులకు శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలమూరులో విరిగిపోయిన లాకుల ఫుట్‌పాత్

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం**
>
> 
>
> పంట పొలాలకు సాగునీరు అందించే లాకుల వద్ద ఇరిగేషన్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల వద్దకు తీసుకువెళ్లాం. ఇప్పటికే తీసుకోవలసిన చర్యలపై రూపొందించిన నివేదికను అందజేశాం. అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తాం.
>
> – టి.కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

వాడపాలెం లాకుపై చానల్స్‌కు నేడు, రేపు సాగునీరు

కొత్తపేట: ప్రస్తుత రబీ పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరాలో భాగంగా మండలంలోని వాడపాలెం లాకుపై ఉన్న చానల్స్‌కు మంగళవారం, బుధవారం సాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకులపైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానళ్లకు మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి బుధవారం మధ్యాహ్నం 12 వరకూ సాగునీటి సరఫరా చేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఆయా చానళ్ల కింద గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేల తల్లి బాగు కోసం ప్రకృతి వ్యవసాయం



ఉచితంగా నత్రజని స్థిరీకరణ కోసం విత్తనాల ప్యాకెట్లను అందజేస్తున్న డీపీఎం సత్యనారాయణ

అయినవిల్లి: ప్రకృతి వ్యవసాయంతో నేల తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు ప్రజలకు అందించవచ్చని నేచురల్ ఫార్మింగ్ అడిషనల్ డీపీఎం సత్యనారాయణ అన్నారు. సోమవారం నేదునూరులో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. సత్యనారాయణ మాట్లాడుతూ నేల భూసారం పెంచేందుకు ప్రస్తుత పరిస్థితిల్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమన్నారు. 30 రకాల విత్తనాలతో సాగు నేల తల్లి బాగు కోసం ప్రభుత్వ సాయంతో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇక్కడ వరి పంట ప్రధాన పంటగా సాగవుతుందన్నారు. రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం ప్రధానమన్నారు. వివిధ రకాల పంట వైవిధ్యం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగి ఆ పంటకు కావలసిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా 365 రోజులు భూమిని కప్పి ఉంచడం వలన భూమిలో తేమ శాతం నిల్వ ఉంటుందన్నారు. సూర్యరశ్మి నేరుగా భూమిని తాకకుండా ఉంటుందన్నారు. తద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు, మిత్రపురుగులు ఉధృతంగా పెరుగుతుందన్నారు. ఇంకా ప్రకృతి వ్యవసాయం వల్ల నత్రజని స్థిరీకరణ, భూసారం పెంచుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు నత్రజని స్థిరీకరణ పెంచేందుకు విత్తనాల ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు. డీపీఎం శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి వై.శోభ, నేచురల్ ఫార్మింగ్ హేమలత, అసిస్టెంట్ ఇంటిగ్రేటెట్ క్రాప్ రిసోర్స్‌పర్సన్స్ సూరిబాబు, జగదీశ్వరి, విలేజ్ అగ్రికల్చర్ అధికారులు, విలేజ్ హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో మంత్రి ఆనం



అంతర్వేదిలో మంత్రి ఆనంకు స్వామి చిత్రపటం ఇస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మంత్రి ఆనంకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు మంత్రి ఆనంకు, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా బహద్దూర్, డీసీ రమేష్‌బాబు, ఏసీ సత్యనారాయణ అందజేశారు. వ్యాపారవేత్త చెరుకూరి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు ఎంపీపీ వినతి

అంతర్వేది ఆలయంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, ఎంపీపీ వీరా మల్లిబాబు ఒక వినతిపత్రం అందజేశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవాలయం ఉత్సవాలను రాష్ట్ర పండగగా ప్రకటించిన విధంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఆ పత్రంలో ఎంపీపీ, మంత్రిని కోరారు.

రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ‘గుత్తుల’కు నేడు సత్కారం



ఆలమూరు: ఇటీవల రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన గుత్తుల వీరబ్రహ్మంకు మంగళవారం ఘన సత్కారం చేయనున్నట్లు మండల బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.లోకేష్, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలమూరులో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని జొన్నాడలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరబ్రహ్మం రాష్ట్ర స్థాయిలో అధ్యక్ష పదవి చేపట్టిన ఈ చిరు సత్కారాన్ని చేయనున్నామన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఈ సత్కారానికి మండల స్థాయిలో బీసీ ఉద్యోగులందరూ హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

ఘనంగా వీరభద్రుని సంబరం



పెదపట్నంలంకలో వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో సోమవారం వీరభద్రస్వామి సంబరం ఘనంగా జరిగింది. సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం, ప్రభ ఊరేగింపు నడుమ వీరభద్రస్వామి సంబరం ఆద్యంతం కనులపండువలా జరిపించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరం నిర్వహించారు. శత వసంతాల సంబరంలో భాగంగా ఘనాపాటి కొమ్ముల హిమయ్ రామ్‌చరణ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రభ ఊరేగింపుతో వైనతేయ గోదావరికి వెళ్లారు. గోదావరి నదీస్నానం అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా వచ్చి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బాల భక్తులు 60 గజాల నిప్పులగుండం తొక్కారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని వీరభద్రస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం వైసీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, కుసుమ శ్రీధర్, నెల్లి దుర్గాప్రసాద్, మొల్లేటి త్రిమూర్తులు, విత్తనాల శేఖర్, జోగి రామకృష్ణ, తులా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11 కేజీల పండుగప్ప చేప



పల్లిపాలెంలో పండుగప్పను దక్కించుకున్న మాంసాహార ప్రియుడు

సఖినేటిపల్లి: పల్లిపాలెం చేపల మార్కెట్‌కు సోమవారం పదకొండు కేజీల బరువున్న పండుగప్పను మత్స్యకారులు తెచ్చారు. ఈ చేపను మాంసాహార ప్రియుడు సుమారు రూ.6 వేలకు వేలంలో కైవశం చేసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

సఖినేటిపల్లి: మండలంలో సోమవారం వేర్వేరు గ్రామాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు వివరాలు తెలిపారు. అప్పనరామునిలంకలో తిరుమారి సుబ్బారావు(59) తన బైక్‌పై గ్రామంలోని పల్లిపాలెం నుంచి సుందరవారి మెరక ఏరియాకు వెళుతున్నాడు. సదరు ప్రాంతానికి వెళ్లేసరికి ఎదురుగా అతివేగంగా ట్రాక్టర్ వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సుబ్బారావు తలకి బలమైన గాయంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సఖినేటిపల్లిల సినిమాహాల్ సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిమూలకు చెందిన బత్తిన పైడి రాజు (23) మృతి చెందాడు. గుడిమూల నుంచి సఖినేటిపల్లి సినిమా హాల్ సెంటర్‌కు తండ్రి బంగార్రాజుతో కలసి పైడి రాజు వెళుతున్నాడు. సినిమాహాల్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన బైక్‌పై ఆగిన పైడిరాజును ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో పైడి రాజు ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై తండ్రి బత్తిన బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ



డ్రోన్ ద్వారా వరిచేనుపై పురుగు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి, మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామాల్లో డొక్కా సీతమ్మ ఫెడ్ ఫార్మర్స్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం వరిచేలపై డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల రైతుకు సమయం ఆదా అవడంతో పాటు, ఖర్చులు తగ్గుతాయని టెక్నికల్ సభ్యులు వివరించారు. అలాగే పిచికారీ చేసిన మందులు కూడా ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగించుకోవాలని కంపెనీ చైర్మన్ ఆరుమిల్లి లాల్‌బహదూర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంపెనీ సీఈఓ దొంగ రామమోహన్, డైరెక్టర్ యర్రంశెట్టి సాయిబాబు, ఆదర్శ రైతు జాన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల జీవనోపాధిపై సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అన్నపూర్ణ

మామిడికుదురు: ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న లక్ష్యంతో విజయవాడ సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు నగరం క్లస్టర్ పరిధిలోని అయిదు గ్రామ పంచాయతీల్లో సోమవారం సర్వే చేపట్టారు. అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక, మొగలికుదురు, నగరం గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యుల అప్పు వివరాలు, వారి కుటుంబ వివరాలు, 2025–26లో వారు జీవనోపాధి కోసం చేపట్టిన కార్యక్రమాలకు ఎంత మేరకు పెట్టుబడి అవసరం అన్న వివరాలపై ప్రణాళిక రూపొందించనున్నారు. దీనికి గాను కోనసీమ జిల్లాలో నగరం క్లస్టర్ పరిధిలో సర్వే చేపట్టారు. దీనిపై ముందుగా మామిడికుదురు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి వచ్చిన డీపీఎం డీపీఎల్ అన్నపూర్ణ, డీపీఎం ఎ.గణేష్, హెచ్‌డీ ఏపీఎం విజయలక్ష్మి, ఉన్నతి ఏపీఎం ఎం.శామ్యూల్, మండల సమాఖ్య ఏపీఎం డి.వరాలబాబు, ఎస్.ఆనందబాబు, ఎంఎస్ అకౌంట్ కె.నాగార్జున, మండల మహిళా సమాఖ్య ఓబీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు

- కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం
- తొలిరోజు పలువురి గైర్హాజరు

కొత్తపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 918 మంది విద్యార్థులున్నారు. కాగా తొలిరోజు తెలుగు పరీక్షకు 918 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 914 మంది హాజరయ్యారు. నలుగురు పరీక్షకు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఓపెన్ టెన్త్‌కు సంబంధించి 3 సెంటర్లలో తొలిరోజు హిందీ పరీక్షకు సంబంధించి 8 మందికి 7 గురు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆత్రేయపురం మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 567 మంది విద్యార్థులకు 563 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు.



మామిడికుదురులో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థిని ఎత్తుకుని తీసుకు వెళ్తున్న దృశ్యం



ఆలమూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అంబాజీపేటలో..

అంబాజీపేట: జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో ఎస్కె సలీంబాషా తెలిపారు. అంబాజీపేట మండలంలో జరిగిన పది పబ్లిక్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం జెడ్పీ హైస్కూళ్లలో 456 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 452 మంది హాజరయ్యారన్నారు. మూడు కేంద్రాల్లోను పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూం నంబర్లను బోర్డులపై ఉంచారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పి.గన్నవరంలో రెండు, ముంగండ, నరేంద్రపురం, మానేపల్లి బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 13 ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 794 మంది విద్యార్థులకు గాను 790 మంది పరీక్షలు హాజరయ్యారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మామిడికుదురు మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మామిడికుదురు పరీక్ష కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థిని ఎత్తుకుని పరీక్ష కేంద్రంలోకి తీసుకవెళ్లారు. మామిడికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడి, లూటుకుర్రు, మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూళ్లతో పాటు మొగలికుదురు ప్రైవేటు స్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 1048 మందికి 1037 మంది, ప్రైవేటు విద్యార్థులు అయిదుగురికి ముగ్గురు పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తెలిపారు. మొత్తం 1053 మందికి 1040 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొదటి రోజు తెలుగు పేపరు ప్రశాంతంగా జరిగింది.



కొత్తపేట సెంటర్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, చెముడులంకలో జెడ్పీ హైస్కూల్‌లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మొత్తం 684 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా అందులో ఇద్దరు విద్యార్థులు మాత్రం గైర్హాజరు కావడంతో 682 మాత్రమే పరీక్షలు రాశారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచీలు, ఇతర ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలకు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: పదో తరగతి పరీక్షలకు 695 మందికి గాను మొదటి రోజు 692 మంది హాజరైనట్లు ఎంఈఓ పి. శ్రీనివాస్ తెలిపారు. 692 మందిలో 350 బాలురు, 345 మంది బాలికలు హాజరయ్యారన్నారు. ముగ్గురు విద్యార్థులు మొదటి రోజు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.